క్లుప్తంగా

భూములు కోల్పోయిన రైతులు క్లయిం చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్

పెద్దదోర్నాల: మండల పరిధిలోని నేషనల్ హైవేకు సంబంధించి భూములు కోల్పోయిన రైతులు తగిన ఆధారాలతో రెవెన్యూ అధికారులకు క్లయిం చేసుకోవాలని యిన్‌చార్జి తహసీల్దార్ పులి శైలేంద్రకుమార్ తెలిపారు. బ్యాంకు అకౌంట్ తదితర వివరాలు సబ్‌మిట్ చేయాలని చెప్పారు. సబ్‌మిట్ చేసిన దరఖాస్తులకు సంబంధించి భూములు ఎంత కోల్పోయారో, దాని విస్తీర్ణం తదితర వివరాలతో భూయజమానులకు నష్టపరిహారం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. నేషనల్ హైవే డీఈ రావి రాధిక, ఆర్ఐ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా నిహారిక

దర్శి: దర్శి జూనియర్ సివిల్ జడ్జిగా కోట్ల నిహారికను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జూనియర్ సివిల్ జడ్జి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నిహారిక ఆ పోస్టుకు ఎన్నికయ్యారు. ఈమె విశాఖపట్నం జిల్లా గాజువాకకు చెందిన యువతి. తొలి పోస్టింగ్ ప్రకాశం జిల్లా దర్శి జూనియర్ సివిల్ జడ్జి మరియు ఫస్ట్ క్లాస్ జుడిషియల్ మెజిస్ట్రేట్‌గా నియమితులయ్యారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

బేస్తవారిపేట: స్థానిక దరగా కొండపై త్రిలోక పుణ్యక్షేత్రంలో సాయిబాబా ఆలయ 34వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి గిరీష్‌రెడ్డి తెలిపారు. పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, కాగడ హారతి పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని చెప్పారు.

నేడు గృహ యజమానులతో సమావేశం

బేస్తవారిపేట: జాతీయ రహదారి 544డీ రోడ్డు విస్తరణలో నివాస గృహాలు, భూములు కోల్పోయిన ప్రజలతో బుధవారం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సమావేశం హాలులో మార్కాపురం సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ షేక్ ఫర్వీన్ తెలిపారు. విస్తరణ పనులు గతంలో పూర్తిస్థాయిలో జరుగకుండా అడ్డుకోవడంపై జేసీ ఆదేశాల మేరకు యజమానులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గృహ, భూములు కోల్పోతున్న యజమానులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

బేస్తవారిపేటలో ఓ మోస్తరు వర్షం

బేస్తవారిపేట: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజులుగా వేసవిని తలపిస్తున్న ఉక్కపోత, ఎండల నుంచి ప్రజలకు కొంతమేర ఉపశమనం కలిగింది. సజ్జ, కంది, కొర్ర, పత్తి పంటలకు కొంతమేర మేలు చేస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గేదెను ఢీకొట్టిన లారీ

పొదిలి: వేగంగా వెళ్తున్న లారీ ఢీకొట్టటంతో తీవ్రంగా గాయపడిన ఓ గేదె అక్కడే కుప్పకూలింది. ఈ సంఘటన మంగళవారం స్థానిక దర్శి రోడ్డులోని రామనగర్ వద్ద చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఉన్న గేదెను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టటంతో కొమ్ము విరిగి, నడుము భాగంలో తీవ్ర గాయమైంది. గేదెలే తమకు జీవనాధారామని, వైద్యం చేయించాలని యజమాని కోరారు.

దోమల నివారణకు చర్యలు

పొదిలి: నగర పంచాయతీ పరిధిలో దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పొదిలిలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. దోమలు అధికంగా ఉన్న కాలనీల ప్రజలు సమాచారం తెలియజేయాలని సూచించారు.

నిలిచిన రైల్వే అభివృద్ధి పనులు



దొనకొండ రైల్వేస్టేషన్



రైల్వేస్టేషన్ ఎదుట నిలిచిన పనులు

- మూడు అడుగులు ముందుకు.. ఆరు అడుగులు వెనక్కి!
- అభివృద్ధి గురించి పట్టించుకోని రైల్వే అధికారులు

దొనకొండ:

అమృత భారత్ పథకం కింద గుంటూరు రైల్వే డివిజన్‌లోని దొనకొండ రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు గతంలో కేంద్ర ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసింది. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ నిధులతో హడావుడిగా అభివృద్ధి పనులు చేపట్టారు. అభివృద్ధిలో మూడు అడుగులు ముందుకు.. ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా దొనకొండ రైల్వేస్టేషన్ దుస్థితి ఉంది. రైల్వేస్టేషన్ ఎదురుగా అందమైన పార్కు, పాదాచారులు నడిచేందుకు సీసీ రోడ్లు, సైడు కాలువలు, వాహనాల స్టాండ్, మరుగుదొడ్ల నిర్మాణాల పనులు ప్రారంభించారు. ఆరు నెలల నుంచి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. ప్రస్తుతం దొనకొండ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు పట్టించుకోవడం లేదు. మొత్తం మీద పది శాతం పనులు కూడా చేపట్టలేదు. ఎవరైనా అభివృద్ధి పనుల గురించి అడిగితే నిధులు లేవు.. కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదని మాట దాటేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం గతంలో నిధులు మంజూరు చేసిన సమయంలో ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశాల జారీ చేసింది. గుంతకల్, హుబ్లీ, తిరుపతి, హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, ఒడిశా తదితర ప్రాంతాలకు రైళ్లు నడుపుతుంటారు. రోజుకు 10 రైళ్లు ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఇటుక, సిమెంట్, ఐరన్ అక్కడనే దర్శనమిస్తున్నాయి. రైల్వే అధికారులు రోజూ చూస్తున్నారు.. వెళ్తున్నారు తప్ప పనుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు.

దొనకొండ జెడ్పీలో ఆటల పోటీలు



జెడ్పీలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు



గౌతమిలో విద్యార్థినులకు కుర్చీలాట

దొనకొండ: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నరసింహారావు విద్యార్థులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామని నరసింహారావు తెలిపారు.

గౌతమి కళాశాలలో..

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, రన్నింగ్ రేస్, కబడ్డీ పోటీలు నిర్వహించినట్లు కళాశాల అడ్మిన్ నానీ తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

దొనకొండ: గ్రామాల్లో ప్రజలకు పోస్టల్ సేవలపై సిబ్బంది అవగాహన కల్పించాలని మార్కాపురం పోస్టల్ సూపరింటెండెంట్ వి.శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక హెడ్ పోస్టాఫీసులో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పోస్టల్ సేవలు ప్రతి ఒక్కరూ ప్రజల మధ్యకు తీసుకెళ్లాలన్నారు. పోస్టల్‌తో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, వాటిని ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. టాటా ఇన్సూరెన్స్, టాటా బజాజ్ ఇన్సూరెన్స్, పోస్టల్ ప్రమాద బీమా, సుకన్య సమృద్ధి యోజన, ఆర్‌డీలు తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఖాతాదారులకు అనేక ప్రయోజనాలు, సౌకర్యాలు కల్పిస్తోందని, సిబ్బంది మీ పోస్టల్ పరిధిలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించాలని శ్రీనివాసులు తెలిపారు. హెడ్ పోస్టాఫీస్ పోస్ట్ మాస్టర్ హర్షద్ ఖాన్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో అజాద్ కా అమృత్ మహోత్సవ్



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో మంగళవారం అజాద్ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో హర్ ఘర్ తిరంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



కురిచేడులో..

కురిచేడు: స్థానిక గ్రంథాలయ శాఖ కార్యాలయంలో మంగళవారం స్వాతంత్య్ర దిన వేడుకల్లో భాగంగా జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్యకు నివాళి అర్పించారు. గ్రంథపాలకురాలు ఎల్.సుమతి ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హర్ ఘర్ తిరంగా ప్రతిజ్ఞ చేయించారు. సచివాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

గ్రామాలను పచ్చదనంతో తీర్చిదిద్దాలి

త్రిపురాంతకం: గ్రామ సీమలను పచ్చదనం.. పరిశుభ్రతతో తీర్చిదిద్దాలని ఎంపీడీఓ వరప్రసాద్, ఈఓఆర్‌డీ మురళీమోహన్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. పర్యావరణం దెబ్బ తీసేందుకు దోహదం చేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలను వీలునంత వరకు పూర్తిగా నిషేధించాలన్నారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అదే విధంగా వీధి దీపాలపై దృష్టి సారించాలని శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పించారు.

సర్దుబాటుతో ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్దుబాటు ప్రక్రియ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టీవీ వీరారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎంఈఓ రాందాస్ నాయక్‌కు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో 14 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, మూడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, వీటిలో ఉపాధ్యాయుల కొరత ఉందని పేర్కొన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జీటీలను సర్‌ప్లస్‌లో చూపకుండా అవసరమైన సబ్జెక్టు టీచర్స్(స్కూల్ అసిస్టెంట్లు లేదా ఎస్‌జీటీలను) ఆయా మున్సిపల్ పాఠశాలలకు సర్దుబాటు చేయాలని కోరారు. మున్సిపల్ పాఠశాలలో సర్‌ప్లస్‌గా ఉన్న ఉపాధ్యాయులను ఆయా మున్సిపాలిటీల పరిధిలోని పాఠశాలల్లోనే సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ఎం.శ్రీనివాస్‌నాయక్, శ్రీరాములు, రవికుమార్, శేషయోగయ్య, వెన్నా కాశిరెడ్డి, నాగ ఫణీంద్ర పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

గిద్దలూరు రూరల్: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, సంఘ సేవకుడు బీఎస్ నారాయణరెడ్డి అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత దేశం గురించి ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ బాధ్యతగా ప్రవర్తించాలన్నారు. నిర్వాహకులు రవీంద్రారెడ్డి, మల్లారెడ్డి,రాజశేఖర్,శివ,శ్రీకాంత్ పాల్గొన్నారు.

చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేసుకోవాలి

బేస్తవారిపేట: గ్రామాల్లో పంచాయతీ కార్మికులు సేకరించిన చెత్త నుంచి సంపద తయారు చేసుకోవాలని ఎంపీడీఓ టి.పార్వతి అన్నారు. మంగళవారం మండలంలోని చెట్టిచర్లలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు వద్ద పంచాయతీ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు రెండో రోజు శిక్షణ ఇచ్చారు. చెత్త సేకరించేటప్పుడు తడి-పొడి చెత్తలను వేరు చేసుకోవాలని, వర్మీ కంపోస్ట్‌గా మార్చడంతో ఆదాయం వస్తుందన్నారు. పంచాయతీలకు ఆదాయ మార్గాలను సృష్టించుకోవడంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని కోరారు. ఈఓపీఆర్డీ పి.రామాంజనేయులు పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు



దర్శి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

కురిచేడు: కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రజనీకుమారి తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి, మండల సర్వేయర్, దేవదాయ శాఖ, వక్ఫ్‌బోర్డు శాఖల అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖా అధికారులు, అటవీశాఖ అధికారులు తప్పక పాల్గొనాలని ఆమె సూచించారు. 16వ తేదీ పడమర కాశీపురం, 20వ తేదీన కల్లూరు, 22న పడమర నాయుడుపాలెం, 23న వీవై కాలనీ, 24న ఆవులమంద, 27న రామాంజనేయ కాలనీ, 28న ముష్ట గంగవరం, 29న ప్రతిజ్ఞాపురి కాలనీ, 30న పడమర వీరాయపాలెం, 31వ తేదీన వెంగాయపాలెం, వచ్చే నెల 3న పెద్దవరం, 4న బయ్యవరం, 6న నమశ్శివాయపురం, 10న బోధనంపాడు, 12న కురిచేడు, 13న కాటంవారిపల్లి, 17న పేరంబొట్లపాలెం, 19న పొట్లపాడు, 20న గంగదొనకొండ, 24న పడమర గంగవరం, 25న రెడ్డెన్నపల్లి, 26న అలవలపాడు, 27న పెనగమూరు, 28న దేకనకొండ, 30న మర్లపాలెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.

దర్శి: గ్రామంలో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విలేకరుల సమావేశం మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు గ్రామంలో అడంగల్, ఒన్‌బీ, పట్టాదారు పాసుపుస్తకాలు మార్పులు, ఆన్‌లైన్ సమస్యలు తీర్చేందుకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 45 రోజుల పాటు మండలంలో సదస్సులు ఉంటాయని చెప్పారు. 90 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అగ్రికల్చర్ ట్రేడ్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్‌ను ప్రత్యేకాధికారిగా ఈ కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు. ఆగస్టు 16వ తేదీ తూర్పు వీరాయపాలెం, మొహిద్దీనాపురం, 17న చెర్వుకొమ్ముపాలెం, సీతాసాగరం, 20న తూర్పు చౌటపాలెం, 21,22న పాతకమూరు, 23న జముకులదిన్నె, అక్కమాంబాపురం, 24న కొత్తపల్లి, 27న లక్ష్మీ నారాయణపురం, 28న శామంతపూడి, 29న కొర్లమడుగు, త్రిపురసుందరీపురం, 30న పెద్దుయ్యాలవాడ, 31న చిన్న ఉయ్యాలవాడ, కృష్ణాపురం, సెప్టెంబర్ నెల 3వ తేదీన రాజంపల్లి, 4న అన్నవరప్పాడు, 5న రామచంద్రాపురం, 6న యర్రోబనపల్లి, బాలాపురం, 10న తూర్పువీరాయపాలెం, గణేశ్వరపురం, 11న లంకోజనపల్లి, 12న బండి వెలిగండ్ల, 13న బుక్కాపురం, 14న జముకులదిన్నె, 17న చందలూరు, 18న తుమ్మెదలపాడు, 19న అబ్బాయిపాలెం, బందెళ్లపాయ, 20న చలివేంద్ర, 21న పోతవరం, 24 తానంచింతల, 25న తిమ్మాయిపాలెం, 27న దేవవరం, 28, 29, 30 తేదీల్లో దర్శి పంచాయతీ పరిధిలో సదస్సులు జరుగుతాయని చెప్పారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పులి శైలేంద్రకుమార్ తెలిపారు. సదస్సులో తమ తమ భూములకు సంబంధించిన వివాదాలు ఏమైనా ఉంటే సదస్సుల్లో పరిష్కరించుకోవాలని సూచించారు. సదస్సులు ఈ నెల 16న నల్లగుంట్ల, 20న చిలకచర్ల గూడెం, 22న వై.చర్లోపల్లి, 24న యడవల్లి, కొత్తూరు, 27న గంటవానిపల్లె, 29న ఐనముక్కల, కడపరాజుపల్లె, 31న దోర్నాల, తిమ్మాపురం, సెప్టెంబర్ 3న హసానబాద, జమ్మిదోర్నాల, 5న చిన్నదోర్నాల, 10న చిన్నగుడిపాడు, 12న కటకానిపల్లె, చింతల అగ్రహారం, 17న రామచంద్రకోట, 19న పెద్దబొమ్మలాపురం, 21న బోడేనాయక్ తండా, 24న చింతల గిరిజన గూడంలో జరుగుతాయని ఆయన వివరించారు.

అర్హులకు కౌలుకార్డులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు: గ్రామాల్లో భూమి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న రైతులకు కౌలు రైతు కార్డులు ఇచ్చేందుకు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం గ్రామ సర్వేయర్‌లు, వీఆర్వోలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1241 మంది కౌలు రైతులను గుర్తించాల్సి ఉండగా ఇప్పటి వరకు 1170 మందిని గుర్తించినట్లు తెలిపారు. ఇంకా గ్రామాల్లో మిగిలిన కౌలు రైతులను వీలైనంత త్వరగా గుర్తించాలన్నారు. భూమిలేని కౌలు రైతులను మాత్రమే గుర్తించాలన్నారు. అర్హతగల ప్రతి రైతుకు కౌలురైతు కార్డు అందజేయాలన్నారు. భూయజమాని ధ్రువీకరణ పత్రం తప్పకుండా ఉండాలన్నారు. కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల రాయితీలు అందేలా చూడాలన్నారు. డీటీ పుల్లారెడ్డి, ల్యాండ్ సర్వే డీటీ స్రవంతి, ఆర్ఐ కేవీ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ పోగుల శేషగిరిరావు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతకు పాటుపడాలి



పెద ఉల్లగల్లులో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్‌లు

ముండ్లమూరు: ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల పరిశుభ్రతకు పాటుపడాలని ఎంపీడీఓ ఆర్.జనార్దన్ తెలిపారు. సర్పంచ్‌లకు రెండో రోజు శిక్షణ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1994 చట్టంలోని సెక్షన్ 45 ప్రకారం ప్రజల ఆరోగ్యం కోసం పారిశుధ్యం విషయంలో గ్రామ పంచాయితీ నిర్వహించాల్సిన పాత్రపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా చెత్త సేకరణలో భాగంగా తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయుటపై కార్మికులకు అవగాహన పెంచాలన్నారు. వర్మీకంపోస్టు తయారీ ప్రక్రియ, మార్కెటింగ్ చేయుటకు సాధ్యాసాధ్యాలపై చర్చించాలన్నారు. పంచాయితీ అభివృద్ధిలో సంఘాల్లోని మహిళల భాగస్వామ్యం, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే అభివృద్ధిపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం పెద ఉల్లగల్లులోని మోడల్ సంపద కేంద్రాన్ని సందర్శించి దాని పనితీరుపై అవగాహన కల్పించారు. ఈఓఆర్డీ శ్రీదేవి, సర్పంచ్‌లు జనమాల నాగేంద్రం, గజ్జల ఆదెమ్మ, పంచాయితీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులపై అంత కక్ష ఎందుకు?



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘం పరిధిలోని ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న పది మంది కాంట్రాక్టు కార్మికులను ఎటువంటి కారణం చూపకుండా తొలగించడం అన్యాయమని మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట అనధికారికంగా తొలగించిన కార్మికులకు మద్దతుగా ధర్నా నిర్వహించారు. రఫీ మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ కార్మికులను తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. సుమారు 20 సంవత్సరాలుగా ఇంజినీరింగ్, వివిధ విభాగాల్లో కార్మికులను తొలగించేందుకు మున్సిపల్ అధికారులు సహకరించడాన్ని తప్పుబట్టారు. కార్మికులకు వేతనం పెంచకపోగా, ఉపాధి అవకాశాన్ని తొలగించి, వారి పొట్టకొట్టడం అన్యాయమన్నారు. కమిషనర్ జోక్యం చేసుకుని తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, హరి, రమణ, నాసరయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే తాటిపర్తి ఆర్థిక సాయం



విద్యార్థిని తల్లికి చెక్కు అందజేస్తున్న ఓబులరెడ్డి

యర్రగొండపాలెం: ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థిని కె.చామంతికి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మంగళవారం రూ.10 వేల సాయం చేసి మంచి మనస్సు చాటుకున్నారు. పుల్లలచెరువు మండలం శతకోడు గ్రామానికి చెందిన చామంతి గుంటూరులో డిప్లొమా చివరి సంవత్సరం చదువుతోంది. ఈ తరుణంలో ఆమె కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విద్యార్థిని చదువు మధ్యలో నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ బాలిక తల్లి పేరుతో రూ.10 వేల చెక్కు పంపించారు. చెక్కును స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి అందజేశారు. నాయకులు రోషిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌తో బాలచంద్రుడు, కరుణయ్య

కొనకనమిట్ల: రెవెన్యూ పరంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగుల విభాగం జిల్లా కార్యదర్శి నుసుం బాలచంద్రుడు కోరారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌ఆవుల సురేష్‌ను బాలచంద్రుడుతోపాటు మండల దివ్యాంగుల విభాగం కన్వీనర్ గొంగటి కరుణయ్య కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. మండలంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను తహసీల్దార్‌కు వివరించగా సానుకూలంగా స్పందించారని చెప్పారు.